సాక్షి
నిజామాబాద్

శుక్రవారం, 29, డిసెంబర్, 2023



సెలవులో పూర్వ వీఆర్‌ఏలు
ఐదు నెలలుగా జీతాలు రాని కారణంగా పూర్వ వీఆర్‌ఏలు సామూహిక సెలవుకు అనుమతివ్వాలని అదనపు కలెక్టర్‌ను కోరారు.

- 10లో ▸



న్యూ ఇయర్ వేడుకలపై..
కొత్త ఏడాదిని స్వాగతిస్తూ డిసెంబర్ 31న నిర్వహించే వేడుకలపై జిల్లా పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు.

- 10లో ▸



వాతావరణం
ఆకాశం ఉదయం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మొదటిరోజు 28,868 దరఖాస్తులు
సుభాష్‌నగర్ : ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభం సందర్భంగా గురువారం మొదటిరోజు 28,868 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 136 జీపీలు మున్సిపల్ వార్డుల్లో సభలు నిర్వహించారు. వీటి పరిధిలో 11,848 దరఖాస్తులు రాగా, మిగతా గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఏర్పాటుచేసిన కౌంటర్లలో 17,020 దరఖాస్తులు వచ్చాయని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ పేర్కొన్నారు. గ్రామ సభలు నిర్వహించిన గ్రామ, మున్సిపల్ వార్డుల పరిధిలో మొత్తం 51,143 నివాస గృహాలు ఉన్నాయన్నారు. రెండోరోజు శుక్రవారం 101 గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో సభలు కొనసాగుతాయని డీపీవో తెలిపారు.

'కరెంట్‌పై కవిత సలహాలు అవసరం లేదు'
ఎడపల్లి(బోధన్) : కరెంట్‌పై ఎమ్మెల్సీ కవిత సలహాలు తమకు అవసరం లేదని, గృహావసరాలకు 200 యూనిట్ల కరెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎడపల్లి మండలం బాపునగర్‌లో ప్రజాపాలన దరఖాస్తులను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడానికి ఈ దరఖాస్తులను సేకరిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ కవిత సిరికొండ మండలంలో మాట్లాడుతూ కరెంట్ బిల్లులు చెల్లించవద్దని చెప్పడం సరైంది కాదన్నారు. కరెంట్ బకాయిలు ఎమ్మెల్సీ కవిత కుటుంబం దోచుకున్న దాంట్లో నుంచి కట్టిస్తామన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎం అవుతానని రూ.60 కోట్లతో కార్లు కొనుగోలు చేసి విజయవాడలో దాచిపెట్టారని, ఈ డబ్బులు పేదలవి కాదా అని ప్రశ్నించారు. ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించిన తర్వాత ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. అర్హులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నిక
డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అడహక్ కమిటీ ఎన్నికను శుక్రవారం జిల్లా కేంద్రంలోని కేసీఆర్ కాలనీ వద్ద ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి రాజనర్సయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు జరిగే ఈ ఎన్నికకు జిల్లాలోని 378 మత్స్యకార సొసైటీ అధ్యక్షులు హాజరు కావాలని, చేతులు పైకెత్తి చీఫ్ ప్రమోటర్‌ను (తాత్కాలిక అధ్యక్షుడిని) ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నుకోబడిన నూతన పాలకవర్గంలో మొత్తం 11 మంది సభ్యులు ఉంటారని, దీర్ఘకాలంగా పని చేసే కొత్త కమిటీని ఎన్నుకునే వరకు వీరే పని చేస్తారన్నారు. కాబట్టి సొసైటీ అధ్యక్షులకు జారీ చేసిన గుర్తింపు కార్డును చూపి సర్వసభ్య సమావేశానికి హాజరై ఎన్నికలో పాల్గొనాలని మత్స్య శాఖ అధికారులు కోరారు.

రూ. 50కి 'ప్రజాపాలన' దరఖాస్తు
భీమ్‌గల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజాపాలన' కార్యక్రమం గురువారం ప్రారంభం కాగా, భీమ్‌గల్‌లోని బాబానగర్ గ్రామంలో గందరగోళం నెలకొంది. జెడ్పీ సీఈవో గోవింద్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో క్యూలో నిలబడ్డ కొద్దిసేపటికే దరఖాస్తులు అయిపోవడంతో ప్రజలు ఆగ్రహానికి గురయ్యారు. కొంతమంది పంచాయతీ కార్యదర్శులు మాత్రం దరఖాస్తులను జిరాక్స్ తీసుకోవచ్చని ఉచిత సలహా ఇవ్వడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి చేసేదేమీ లేక జిరాక్స్ సెంటర్లలో ఒక్కో దరఖాస్తు రూ. 50కి కొనుగోలు చేశారు. అధికారులను వివరణ కోరగా ప్రజలు లెక్కకు మించి రావడంతో ఇబ్బందిగా మారిందని, నేటి నుంచి సరైనవిధంగా దరఖాస్తులను అందజేస్తామని వివరించారు.

ఎన్నికల ఖర్చు వివరాలు సరిచేసుకోవాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : 2023 నవంబర్ 30న జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాకు సంబంధించి ఆయా శాసనసభ నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల సందర్భంగా చేసిన ఖర్చుల వివరాలను 29న పరిశీలిస్తామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి పోటీచేసిన అభ్యర్థులు కలెక్టరేట్‌లో వారి ఎన్నికల ఖర్చుల వివరాలను సమర్పించి, జమాఖర్చుల్లో వ్యత్యాసాలను సరి చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

మొదలైన ప్రజాపాలన

- పల్లెలు, వార్డుల్లో పకడ్బందీగా సభలు
- భాగస్వాములైన ప్రజాప్రతినిధులు, అధికారులు
- గ్రామగ్రామాన అనూహ్య స్పందన
- కొన్నిచోట్ల దరఖాస్తుల కోసం తోపులాటలు
- ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తుల స్వీకరణ
- నిర్వహణ తీరును పర్యవేక్షించిన కలెక్టర్, నోడల్ అధికారి
- అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి



ఎడపల్లిలోని బాపునగర్‌లో ప్రజాపాలన దరఖాస్తును స్వీకరిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



పేయింటర్స్‌కాలనీలో దరఖాస్తుల కోసం పోటాపోటీ

సుభాష్‌నగర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని జిల్లాలో గురువారం అట్టహాసంగా ప్రారంభించారు. జనవరి 6వ తేదీ వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమం కోసం గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా షెడ్యూల్ ఖరారు చేశారు. ఇందులో భాగంగా మొదటి రోజు 112 గ్రామ పంచాయతీలు, 24 మున్సిపల్ వార్డులు, మొత్తంగా 136 ప్రాంతాల్లో సభలు జరిగాయి. స్వీకరించిన ప్రతి దరఖాస్తు వివరాలను ప్రత్యేకంగా రిజిస్టర్‌లో నమోదు చేస్తూ, దరఖాస్తుదారులకు రశీదులు అందించారు. దరఖాస్తుల వివరాలను కంప్యూటరీకరణ చేసేందుకు వీలుగా టీమ్ లీడర్లు వాటిని భద్రపర్చారు. ఉదయం 8 గంటలకే ప్రజాపాలన సభలతో పల్లెలు, వార్డుల్లో సందడి మొదలైంది. రెండు సెషన్లలో సభలను నిర్వహించారు. దరఖాస్తులను ఇంటింటికీ పంపిణీ చేయడంతోపాటు కౌంటర్లలో అందుబాటులో ఉంచారు.

కలెక్టర్ పర్యవేక్షణ..

జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని మాధవనగర్, మోపాల్ మండలం తాడెం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన సభలను క్షేత్రస్థాయిలో సందర్శించి నిర్వహణ తీరుతెన్నుల ను పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ, రసీదులు అందజేత, రిజిస్టర్ల నిర్వహణ, వివరాల నమోదు, ప్రజలకు అందుబాటులో ఉంచిన తాగునీరు, షామియానాలు వంటి వసతులను పరిశీలించి అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్ హరిత ఇందల్వాయి మండలం రంజిత్ నాయక్ తండా, డిచ్‌పల్లి మండలం వెస్లీనగర్ తండా, మాధవనగర్ తదితర ప్రాంతాల్లో ప్రజాపాలన కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించారు. అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, పి యాదిరెడ్డి, నగర పాలక కమిషనర్ మకరంద్ కూడా విస్తృతంగా పర్యటిస్తూ ప్రజాపాలన సభలకు తోడ్పాటు అందించారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు సంబంధించి ప్రజలు పెద్దసంఖ్యలో దరఖాస్తులు అందించారు.

బాపునగర్‌లో..

బోధన్ నియోజకవర్గం ఎడపల్లి మండలంలోని బాపునగర్‌లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడమే ప్రజా పాలన ధ్యేయమని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి బోధన్ పట్టణంలోని ఆయా వార్డులతో పాటు చిన్నమావందిలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో..

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఖానాపూర్‌లో ప్రజాపాలన గ్రామసభను రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి ప్రారంభించారు. అర్హులైన ఏ ఒక్కరు కూడా తప్పిపోకుండా నిర్ణీత కాలవ్యవధిలో అందరికీ ఆయా పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సభల్లో తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు తమ ఆటపాటలతో ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

దరఖాస్తులకు కొరత లేదు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



సుభాష్‌నగర్ : జిల్లాలో ప్రజాపాలన సభల్లో దరఖాస్తు ఫారాలకు ఎలాంటి కొరత లేదని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. జిల్లాలోని 530 జీపీల పరిధిలో మొత్తం 2,75,183 నివాస గృహాలు ఉండగా, అంతే సంఖ్యలో దరఖాస్తు ఫారాలు ఆయా జీపీలకు పంపిణీ చేశామన్నారు. అదేవిధంగా నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 146 వార్డులకు గాను 1,30,866 దరఖాస్తులు పంపిణీ చేశామన్నారు. పంచాయతీలు, వార్డులను కలుపుకుని మొత్తం 4,06,049 దరఖాస్తులు కేటాయించి, గ్రామాల్లో జీపీ కార్యదర్శుల ద్వారా, మున్సిపల్ పట్టణాల్లో ఆర్‌పీలు, ఇతర సిబ్బంది ద్వారా ప్రజలకు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. వీటితో పాటు అదనంగా మరో 93,000 దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచామన్నారు. దరఖాస్తు ఫారాలకు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు.





నగరంలో దరఖాస్తు ఫారంను అందజేస్తున్న ధన్‌పాల్ సూర్యనారాయణ, రూరల్‌లో ఎమ్మెల్యే భూపతిరెడ్డి

అమిత్‌షాతో ఎమ్మెల్యేలు..



అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నమస్కరిస్తున్న ఎమ్మెల్యేలు పైడి రాకేశ్ రెడ్డి, వెంకట రమణారెడ్డి.

హైదరాబాద్‌లో నిర్వహించిన బీజేపీ రాష్ట్రస్థాయి సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరయ్యారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అమిత్‌షాను సన్మానించారు.

ఇటు దోపిడీ.. అటు ప్రాణాలు హరీ..

- రసాయనాలతో లక్షల లీటర్ల కృత్రిమ కల్లు తయారీ
- నిజామాబాద్‌లో అనధికారికంగా తొమ్మిది బట్టీలు నడుపుతోన్న డిపో–3
- సభ్యులను కాదని ముగ్గురు మాత్రమే రాజ్యమేలుతున్న వైనం
- అన్నీ తెలిసీ నటిస్తున్న ఆబ్కారీ అధికారులు



కల్లు డిపో–3లో కృత్రిమ కల్లు ప్యాకెట్లు తయారు చేసే యంత్రం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లా కేంద్రంలో కల్లు డిపోలు ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. మరోవైపు ఆయా సొసైటీల్లోని సభ్యులను కూడా దోపిడీ చేస్తున్న వ్యవహారాలు బహిరంగ రహస్యాలుగా ఉన్నాయి. నగరంలో తాటి చెట్లు, ఈత చెట్లు లేవు. అయితే కల్లు మాత్రం రోజుకు ఒక లక్ష లీటర్ల మేర తయారవుతోంది. ఇదంతా కృత్రిమమే. ధనార్జనే ధ్యేయంగా రసాయనాలతో తయారు చేస్తున్న ఈ కల్లు కారణంగా అనేకమంది జీవచ్ఛవాలుగా మారుతున్నారు. మూడు రోజులుగా హైదరాబాద్ నగరం శివారు ప్రాంతాల్లో డైజోఫాం, ఆల్ప్రాజోలం తయారు చేస్తున్న అక్రమ కంపెనీలను పోలీసులు సీజ్ చేసి పలువురిని అరెస్టు సైతం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి డ్రగ్స్, కృత్రిమ కల్లు వ్యాపారాన్ని సహించేది లేదని ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కృత్రిమ కల్లు తయారీ వ్యవహారాలపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఆల్ప్రాజోలం, డైజోఫాం, శాక్రీన్, కుంకుడు రసం, పేస్ట్ తదితర రసాయనాలతో తయారైన ఈ కల్లుకు బానిసలైన పలువురు మృత్యువాత పడుతున్నారు. ఒక్కపూట ఈ కల్లు లభించకపోవడంతో పిచ్చిపిచ్చిగా ప్రవర్తించే పరిస్థితి. ఒక్క నిజామాబాద్ నగరంలోనే ప్రతిరోజూ సుమారు 1లక్ష లీటర్ల కల్లు అమ్ముడవుతోందంటే కృత్రిమం ఎంత విచ్చలవిడిగా నడుస్తోందో తెలుసుకోవచ్చు. కల్లు ప్రియుల ప్రాణాలతో ఆటలాడుతూ రూ.కోట్లు దండుకుంటున్నారు కల్లు వ్యాపారులు. నిజామాబాద్‌లో 3 కల్లు డిపోలు ఉండగా, 4,000 మంది సభ్యులున్న 1, 2 డిపోల పరిధిలో 11 దుకాణాలున్నాయి. ఇదిలా ఉండగా కేవలం 100 మంది సభ్యులు మాత్రమే కలిగి ఉన్న డిపో–3 పరిధిలో మాత్రం ఏకంగా 19 అధికారిక డిపోలు ఉండగా, మరో 9 అనధికారిక దుకాణాలున్నాయి. ఇందులో ప్రతిరోజూ రూ. 4 నుంచి రూ. 6 లక్షల మేర అమ్మకాలు జరుగుతున్నాయి. ఇవన్నీ చూస్తున్న ఆబ్కారీ అధికారులు మాత్రం ఎప్పటికప్పుడు ముడుపులు తీసుకుంటూ తమకేమీ తెలియనట్లు నటిస్తుండడం గమనార్హం. హైదరాబాద్ నుంచి ఆదేశాలొస్తే మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తుండడం విశేషం.

డిపో–3లో అక్రమాలు..
నగరంలోని డిపో–1,2 లలో ఉన్న 4వేల మంది సొసైటీ సభ్యులకు ఒక్కొక్కరికి ప్రతి నెల రూ. 2,300 చొప్పున నగదు చెల్లిస్తున్నారు. ఇక డిపో–3 విషయానికి వస్తే అడుగడుగునా అక్రమాలే నెలకొన్నాయి. దీని పరిధిలో అనధికారికంగా 9 దుకాణాలు అదనంగా నడిపిస్తున్నారు. ఇందులో ఉన్న 100 మంది సొసైటీ సభ్యులకు మాత్రం నెలకు కేవలం రూ. 500 మాత్రమే చెల్లిస్తున్నారు. అది కూడా సక్రమంగా చెల్లించట్లేదు. డిపో–3లో కేవలం ముగ్గురు వ్యక్తులు మాత్రమే ప్రతినెలా అక్రమంగా రూ. లక్షల్లో దండుకుంటూ ఇప్పటికే కోట్లు వెనకేసుకున్నట్లు పలువురు సభ్యులు చెబుతున్నారు. సొసైటీ సభ్యులను కూడా మోసం చేస్తుండడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతానికి చెందిన గోపు లావణ్య అనే మహిళ, డిపో–3 పరిధిలో కల్తీకల్లు తాగడంతో తన భర్త రామలింగం మరణించాడని, డిపో నిర్వాహకులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఏడాది క్రితం కోరినా పట్టించుకోకపోవడం గమనార్హం.

30 ఏళ్లకే వృద్ధులుగా..
పాఠశాల స్థాయి పిల్లల నుంచి మొదలు పండు ముసలి వరకు గుల్ఫారం లేనిదే కాలు బయట పెట్టలేకపోతున్నారు. తాటి, ఈత చెట్ల సంఖ్యతో పోలిస్తే కృత్రిమంగా తయారవుతున్న కల్లు వందల రెట్లు ఎక్కువ. శరీరంలోని ప్రతి కణాన్ని పీల్చిపిప్పి చేసి మరణాలకు కారణమవుతోంది. కృత్రిమ కల్లులో కలిపేవన్నీ పూర్తిగా నిషేధిత మత్తు పదార్థాలు. వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే తీసుకునే మత్తు పదార్థాలను, కొందరి సంపాదన కోసం కొందరు అనైతిక చర్యలకు పాల్పడుతున్నారు. డైజోఫాం, ఆల్ప్రాజోలం, క్లోరోఫాం లేదా క్లోరోల్ హైడ్రేట్లు, యూరియా, సిట్రిక్ యాసిడ్, అమ్మోనియం మిశ్రమాలు, సోడా యాష్, కుంకుడు కాయ రసం ఈ కృత్రిమ కల్లు తయారీకి వాడుతున్నారు. మోతాదుకు మించిన పరిమాణంలో రసాయనాలను కల్తీకల్లులో కలపడంతో నాడీ వ్యవస్థతో పాటు, గుండె పోటు, జీర్ణ వ్యవస్థ దెబ్బ తినడం, జ్ఞాపకశక్తి కోల్పోవడం, మూత్రపిండాల సమస్యలు, సెక్స్ సంతాన సామర్థ్యంపై ప్రభావం, సామాజికంగా, ఆర్థికంగా, కుటుంబపరంగా కోలుకోకుండా చేస్తాయి. నేరప్రవృత్తి పెరుగుతుంది.



– డాక్టర్ బీవీ కేశవులు, ఎండీ, చైర్మన్, నేషనల్ యాంటీ డ్రగ్స్ సంస్థ

తనిఖీలు మరిచిన ఎక్సైజ్..
కల్లు డిపోల నిర్వాహకులు ప్రతినెలా ఎక్సైజ్, పోలీస్ అధికారి హోదాను బట్టి మామూళ్లు ముట్టజెబుతున్నారు. దీంతో అధికారులు కల్లు డిపోలు, దుకాణాలపై కన్నెత్తి చూడడం లేదు. ప్రతీనెలా ఎక్సైజ్ శాఖలో అధికారి హోదాను బట్టి రూ. 20 వేల నుంచి రూ. 80 వేల వరకు, పోలీస్ శాఖలో కూడా ఇదేరీతిలో ముడుపులు కల్లు డిపోల ద్వారా అందుతున్నాయనేది బహిరంగ రహస్యం.



నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో ఉన్న కల్లు డిపో–3

ఇందూరు బిడ్డలు.. క్రీడల్లో మెరికలు

- గోరంత ప్రోత్సాహంతో కొండంత ఎత్తుకు..
- బాక్సింగ్‌లో హుస్సాముద్దీన్‌కు అర్జున అవార్డు
- ఫుట్‌బాల్ జాతీయ జట్టుకు గుగ్లోత్ సౌమ్య ప్రాతినిధ్యం
- జాతీయ సాఫ్ట్‌బాల్ జట్లలో జిల్లా క్రీడాకారిణులు

ఆకాశమే హద్దుగా ఇందూరు క్రీడాకారులు అద్భుతాలు చేస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపై రాణిస్తూ ఇందూరు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేస్తున్నారు. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ఇందూరు బిడ్డలు దూసుకెళ్తున్నారు. అందివచ్చిన అవకాశాలను క్రీడాకారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని తమకుతామే సాటిగా నిలుస్తున్నారు. 2023లో జిల్లా క్రీడాకారులు ఎన్నో మధురజ్ఞాపకాలను సొంతం చేసుకున్నారు. బాక్సింగ్, ఫుట్‌బాల్, సాఫ్ట్‌బాల్ క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ జిల్లా కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు.



అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో రాణించిన గురుకుల క్రీడాకారిణులు



నిఖత్ జరీన్, గుగ్లోత్ సౌమ్య, హుస్సాముద్దీన్

నిజామాబాద్‌నాగారం : నగరంరానికి చెందిన నిఖత్‌జరీన్ పేరు అందరికీ సుపరిచితమే.. బాక్సింగ్ క్రీడనే ప్రాణంగా భావిస్తూ అంతర్జాతీయ వేదికలపై ఆమె అద్భుతాలు సాధించింది. గత ఒలింపిక్‌లో మేరికోమ్ కారణంగా అర్హత సాధించకపోయినప్పటికీ తన బరువును తగ్గించుకుని 50కేజీల విభాగంలో ప్రతిభ చూపింది. ఈ ఏడాది ఏప్రిల్, మేలో ఢిల్లీలో జరిగిన ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో నిఖత్ బంగారు పతకం సాధించింది. అక్టోబర్‌లో చైనాలో జరిగిన ఏషియన్ టోర్నీలో సెమీస్‌కు వెళ్లగానే 2024 ఒలింపిక్‌కు అర్హత సాధించింది. అలాగే కాంస్యపతకం సాధించింది. పంజాబ్‌లోని పటియాలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటుంది.

అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ వేదికపై..

భారత సాఫ్ట్‌బాల్ జట్టుకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లాలోని డిచ్‌పల్లి మండలం సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన క్రీడాకారిణులు అంతర్జాతీయస్థాయి టోర్నీలో ఆడారు. ఈ ఏడాది జూన్ 13 నుంచి 17 వరకు తైవాన్‌లో తైపిలో అండర్–15 ఏషియన్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఇందులో గుగ్లోత్ సౌందర్య, గోక సాత్విక, గోక శ్రావిక (సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సుద్దపల్లి), సుంపాక సౌమ్యరాణి(గురుకుల పాఠశాల తాడ్వాయి), సరయు (గురుకుల పాఠశాల ధర్మారం) టోర్నీలో ఆడారు. ఏ.ఇందు, లాకవత్ రాణి అండర్–18 (ఆర్మూర్ మహిళ డిగ్రీ కళాశాల) ఈ ఏడాది ఆగష్టు 29 నుంచి చైనా జరిగిన సాఫ్ట్‌బాల్ ఏషియన్ టోర్నీలో ఆడారు. జి.వినయ్ అండర్–18 (ఆర్మూర్ గురుకుల పాఠశాల) ఏషియన్ చాంపియన్‌షిప్ ఈ ఏడాది 23 జూన్‌లో కొచ్చి టోర్నీలో పాల్గొన్నారు. అలాగే బాక్సింగ్, షటిల్ బ్యాడ్మింటన్, హాకీ, ఫుట్‌బాల్, కబడ్డీ, సైక్లింగ్, స్విమ్మింగ్, ఉషు, అథ్లెటిక్స్ క్రీడల్లో క్రీడాకారులు రాణించారు.

హుస్సాముద్దీన్ అత్యుత్తమ ప్రతిభ
అలాగే జిల్లాకు చెందిన హుస్సాముద్దీన్ కూడా తనదైన శైలిలో దూసుకెళ్తున్నారు. ఆర్మీలో చేరినప్పటికీ క్రీడల్లో రాణిస్తున్నాడు. ఈ ఏడాది మేలో తాష్కెంట్‌లో జరిగిన మేన్ వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించారు. దీంతో కేంద్రప్రభుత్వం అర్జున అవార్డుకు ఎంపిక చేసింది. గతేడాది బాక్సింగ్‌లో నిఖత్‌కు అర్జున అవార్డు వచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో మన జిల్లా నుంచే వరుస ఏడాదిల్లో అర్జున అవార్డులు రావడంతో క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం హుస్సాముద్దీన్ కూడా పటియాలో శిక్షణ తీసుకుంటున్నారు.

ఏషియన్ గేమ్స్‌కు గుగ్లోత్ సౌమ్య
ఫుట్‌బాల్ క్రీడల్లో చిన్ననాటి సహకారంతో కోచ్ నాగరాజు కృషితో గుగ్లోత్ సౌమ్య ఉన్నతశిఖరాల వైపు పయనిస్తోంది. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళ ఫుట్‌బాల్ టోర్నీ కోసం ఢిల్లీలో ప్రత్యేక శిక్షణ తీసుకుంది. శిక్షణ సమయంలో గాయపడడంతో టోర్నీకి వెళ్లలేదు. ఇటీవలే ఏషియన్ చాంపియన్‌షిప్‌కు ఎంపికై ప్రతిభ చూపింది. గత ప్రభుత్వం కోచింగ్ కోసం ఆర్థికసాయం ఇస్తామని చెప్పి ఏమీ ఇవ్వలేదు.

అంతర్జాతీయ రెజ్లింగ్‌లో ఆర్మూర్ క్రీడాకారుల ప్రతిభ



ఇండో నేపాల్ అంతర్జాతీయ రెజ్లింగ్ టోర్నీలో గోల్డ్‌మెడళ్లు సాధించిన ప్రసాద్, మహేశ్

ఆర్మూర్: ఆర్మూర్‌కు చెందిన మిత్రులు డాకూరి భాను ప్రసాద్, ఓర్సు మహేశ్ నేపాల్‌లో డిసెంబర్ 12వ తేదీన నిర్వహించిన ఇండో నేపాల్ అంతర్జాతీయ రూరల్ గేమ్స్ చాంపియన్‌షిప్ 2023లో రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో గెలిచి గోల్‌మెడల్ సాధించారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన డాకూరి భాను ప్రసాద్, ఓర్సు మహేష్ ఆర్మూర్‌లోని ఆలూర్‌లో మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి నుంచి పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి రెజ్లింగ్ క్రీడాకారుడు భూపతిరాజ్ శిక్షణతో రాణించారు. తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో, రాష్ట్ర అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్, రూరల్ గేమ్స్ ఆఫ్ స్టేట్ లెవల్ ఛాంపియన్ షిప్‌లో, రూరల్ గేమ్స్ నేషనల్ ఛాంపియన్ షిప్‌లో జాతీయ స్థాయిలో గోల్‌మెడల్స్ సాధించారు. 2023లో గోవాలో రూరల్ గేమ్స్ నేషనల్ టోర్నీలో డాకూరి భాను ప్రసాద్, ఓర్సు మహేశ్ బంగారు పతకాలను కైవసం చేసుకొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. తాజాగా నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో భాను ప్రసాద్, మహేష్ బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు.

క్లుప్తంగా

బ్రిడ్జ్ కోర్సు కోసం దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: ఐటీఐలో రెండేళ్ల ట్రెయినింగ్ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో అడ్మిషన్లు పొందేందుకు బ్రిడ్జ్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, నిజామాబాద్ ఐటీఐ (బాలుర) ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు రెండేళ్ల ఐటీఐ కోర్సులో 60శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కోర్సుకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు చదువుకోవాలని తెలిపారు. శుక్రవారం నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తులను నగరంలోని బాలుర ఐటీఐలో సమర్పించాలని సూచించారు.పూర్తి వివరాలకు 94417 84849 నంబరును సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పల్లికొండ విద్యార్థినులు



భీమ్‌గల్: నెట్ బాల్ అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల కు మండలంలోని పల్లికొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. బి.సంజన, ఏ.స్వాతి, పి.శ్రీజ ఎంపికయ్యారు. ఈ నెల 30, 31న వచ్చే నెల 1న నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. హెచ్‌ఎం అనురాధ, పీఈటీ రమేశ్‌గౌడ్ విద్యార్థినులను అభినందించారు.

నేడు తెయూలో సాక దళిత కథావార్షిక గ్రంథావిష్కరణ

తెయూ(డిచ్‌పల్లి): జంబూ సాహితీ, తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయనశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 'సాక' దళిత కథా వార్షిక 2022 గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ సెమినార్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ గుండెడప్పు కనకయ్య హాజరై గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని, గుడిపల్లి నిరంజన్ సభాధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. విశిష్ట అతిథులుగా ప్రముఖ సాహిత్య విమర్శకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, హైదరాబాద్ ప్రభుత్వ సిటీ కాలేజ్ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు హాజరవుతారని పీఆర్వో పున్నయ్య తెలిపారు.

జాతీయస్థాయి క్రికెట్ టోర్నీకి బెజుగం శ్రీజ ఎంపిక


బెజుగం శ్రీజ

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి క్రికెట్ టోర్నీ ఎడపల్లికి చెందిన బెజుగం శ్రీజ ఎంపికైంది. జనవరిలో కేరళలో జరిగే పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి వికెట్ కీపర్‌గా ఎంపిక అయ్యింది. శ్రీజను పీఆర్‌టీయూ ఎడపల్లి మండలాధ్యక్షుడు పసుల అభిమాన్యు అభినందించారు.

వ్యాపారిపై కేసు నమోదు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ కాలనీలో తూకంలో మోసం చేసిన ఓ ఐరన్ రింగ్స్ వ్యాపారిపై జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. భవన నిర్మాణాల్లో వినియోగించే ఇనుప రింగుల తయారు చేసి విక్రయాలు చేసే క్రమంలో తూకంలో భారీగా మోసం చేస్తున్నాడని ఫిర్యాదు రావడంతో గురువారం లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి నిర్మల్‌కుమార్ దాడులు నిర్వహించి విచారణ చేపట్టారు. తూకంలో మోసం చేసినట్లు నిర్ధారణ కావడంతో సదరు వ్యాపారిపై కేసు నమోదు చేశామని అధికారి తెలిపారు.

న్యూఇయర్ వేడుకలపై ఆంక్షలు

- మైనర్లకు బైక్‌లు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు
- అదనపు డీసీపీ జయరాం



ఖలీల్‌వాడి : కొత్త సంవత్సర వేడుకలపై పోలీసుల నిబంధనలు తప్పకుండా పాటించాలని అదనపు డీసీపీ జయరాం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మత్తులో రోడ్లపై తిరిగితే ప్రమాదాలకు గురువుతారని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా పోలీస్ అనుమతి లేకుండా న్యూ ఇయర్ కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. ఫామ్‌హౌస్, క్లబ్స్, గ్రేటెడ్ కమ్యూనిటీలో అనుమతి లేకుండా నూతన సంవత్సర కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. వాటిని కూడా పరిమితి మించకుండా సౌండ్ వాడరాదన్నారు. క్రాకర్స్, ఆర్కెస్ట్రా, సౌండ్‌సిస్టమ్ లేదా అత్యధిక మోతాదులో ఉన్న సౌండ్ సిస్టమ్ (డీజే) ఏర్పాట్లు నిషేధించినట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ పరిధిల్లో సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపడ్తామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ సందర్భంగా ఫొటోగ్రాఫీ, వీడియోగ్రఫీలు తీసిన తర్వాత వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

పెండింగ్ చలాన్లు చెల్లించాలి..

జీవో నం. 659, ఈనెల 26 నుంచి పెండింగ్ వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను చెల్లించి, రాయితీ పొందాలని డీసీపీ జయరాం తెలిపారు. కోవిడ్ సమయం, తర్వాత విధించిన వారి వాహనాలపై పెండింగ్ చలాన్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. టూ, త్రీ వీల్లర్స్‌కు 80 శాతం, బస్సులకు 90 శాతం, ఫోర్ వీలర్స్‌కు 60 శాతం రాయితీ ఉందన్నారు.

నిబంధనలివి..

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం నిషేధమని అదనపు డీసీపీ జయరాం పేర్కొన్నారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వొదన్నారు. పట్టుబడితే మైనర్ తోపాటు వాహనం యాజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు.త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్లను తీసివేసి నడిపితే వాహనాలు సీజ్ చేస్తామన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

- దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర ద్వారా అవగాహన కల్పిస్తున్న రాబిన్ సింగ్


జిల్లా కేంద్రానికి చేరుకున్న రాబిన్‌సింగ్

సుభాష్‌నగర్/ఇందల్వాయి : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉత్తరప్రదేశ్‌లోని ఇటావాకు చెందిన సామాజిక కార్యకర్త రాబిన్ సింగ్ పిలుపునిచ్చారు. కలుషితమవుతున్న పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత చాటుతూ, ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాబిన్‌సింగ్ దేశవ్యాప్తంగా సుదీర్ఘ సైకిల్‌యాత్ర నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సైకిల్‌యాత్ర గురువారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈసందర్భంగా ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ వద్ద రాబిన్ సింగ్ మాట్లాడుతూ నానాటికీ పర్యావరణం కాలుష్య కోరల్లో చిక్కుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. రసాయనిక ఎరువులు వాడడం వల్ల భూసారం దెబ్బతింటోందని, పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయని తెలిపారు. ఈ పరిణామం ప్రాణకోటి మనుగడకే ప్రమాదకరంగా పరిణమించిందని ఆవేదన వెలిబుచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణ తమ ప్రథమ కర్తవ్యంగా భావిస్తూ, ఆ దిశగా అంకితభావంతో కృషి చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు తాను 2022 అక్టోబర్ 06న కన్యాకుమారి నుంచి సైకిల్ యాత్ర చేపట్టానని రాబిన్ సింగ్ తెలిపారు. ఇప్పటివరకు తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, అసోం, మేఘాలయ, బీహార్, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, ఢిల్లీ, గోవా తదితర ప్రాంతాల మీదుగా 448 రోజుల్లో 26వేల కిలోమీటర్ల సైకిల్ యాత్ర పూర్తి చేశానని వివరించారు. ఛత్తీస్‌గఢ్ మీదుగా భోపాల్ వరకు తనయాత్ర కొనసాగుతుందని రాబిన్ సింగ్ పేర్కొన్నారు.

సామూహిక సెలవుకు అనుమతివ్వండి


వినతిపత్రం అందజేస్తున్న పూర్వ వీఆర్‌ఏలు

- అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి పూర్వ వీఆర్‌ఏల వినతి

సుభాష్‌నగర్: గత ప్రభుత్వం వీఆర్‌ఏలకు పదోన్నతులు ఇచ్చి వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిందని, కానీ ఐదు నెలలుగా ఎంప్లాయీ ఐడీ, జీతాలు ఇవ్వలేదని, అందుకే జేఏసీ పిలుపు మేరకు వీఆర్‌ఏలందరూ సామూహికంగా సెలవులు తీసుకోవాలని నిర్ణయించినట్లు నాయకులు పేర్కొన్నారు. సెలవులకు అనుమతి ఇవ్వాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి గురువారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పదోన్నతులు ఇచ్చి జూనియర్ అసిస్టెంట్, వార్డు ఆఫీసర్, రికార్డ్ అసిస్టెంట్, ఇతర హోదాల్లో సర్దుబాటు చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పూర్వ వీఆర్‌ఏలకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదని, ఎంప్లాయీ ఐడీ ఇంతవరకూ రాలేదని తెలిపారు. అంతేకాకుండా సమ్మెకాలం మూడు నెలలు కూడా జీతాలు రాలేవన్నారు. దీంతో ఇతర మండలాలు, జిల్లాలకు వెళ్లిన వీఆర్‌ఏలు మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకోసం గురువారం నుంచి ఎంప్లాయీ ఐడీ క్రియేట్ అయ్యేవరకూ సామూహిక సెలవులు తీసుకోవాలని నిర్ణయించామని తెలిపారు. ఇది ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాదని, కేవలం తమ సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లి త్వరితగతిన పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులను చితకబాదిన పాఠశాల ప్రిన్సిపాల్

- పోలీసులు, డీఈవోకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

ఆర్మూర్: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్ అకారణంగా ఇద్దరు పదో తరగతి విద్యార్థులను చితకబాదాడని ఆరోపిస్తూ తల్లిదండ్రులు ఆర్మూర్ పోలీస్ స్టేషన్, ఎంఈవో రాజగంగారాం, డీఈవో దుర్గాప్రసాద్‌కు గురువారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పాఠశాలపై అంతస్తులో ఉన్న వాటర్ ట్యాంక్‌ను ఎవరో పగులగొడితే అందుకు కారణం ఎవరని నిజనిర్ధారణ చేసుకోకుండా ఆ నేరాన్ని తమ పిల్లలపై వేసి పలుమార్లు చితకబాదడంతో పాటు మధ్యాహ్నం భోజనం చేయకుండా అడ్డుకున్నాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తలలను గోడకేసి బాదడంతో పాటు దుర్భాషలాడినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా తమ పిల్లలకు టీసీ ఇచ్చి పంపించి వేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

యూనియన్ బ్యాంక్‌ను తనిఖీ చేసిన ఏజీఎం

సాక్షి ఎఫెక్ట్..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ యూనియన్ బ్యాంక్‌లో జరుగుతున్న అక్రమాల తీరుపై 'సాక్షి'లో వరుసగా కథనాలు ప్రచురితమవడంతో బ్యాంకు అధికారులు స్పందించారు. ఏజీఎం, పీఎంఈజీపీ రికవరీ అధికారులు గురువారం బ్యాంక్‌ను సందర్శించారు. చనిపోయిన వారికి రుణాలు ఇస్తున్నారని, బ్యాంక్‌లో కమీషన్ ఏజెంట్ల నిర్వాకం, ఏజెంట్లు చెప్పిన వారికే రుణాలు ఇస్తున్నారనే విషయాన్ని 'ఆత్మకు పంట రుణం', 'కమీషన్ ఏజంట్లదే హవా' 'ఏజెంట్లు చెబితేనే రుణాలు' అనే శీర్షికలతో వరుస కథనాలు ప్రచురించిన విషయం విదితమే. ఈ కథనాలకు అధికారులు స్పందించి బ్యాంక్ సీసీ ఫుటేజీలు పరిశీలిచారు. ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న వారి ఖా తాలను, పీఎంఈజీపీ రుణాల పంపిణీ తీరుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నివేదికను తయారు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామ ని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ భవనేశ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- జాతీయ ప్రమాణాల కమిటీ సభ్యుడు డాక్టర్ పావెంత్


వైద్య సిబ్బందితో కమిటీ సభ్యులు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రోగులకు ఉత్తమ వైద్యసేవలు అందించాలని జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ సభ్యులు డాక్టర్ పావెంత్ అన్నారు. రామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో కమిటీ సభ్యుల తనిఖీలు గురువారం రెండోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా డాక్టర్ పావెంత్, రోనాక్ శర్మ ఆస్పత్రి పరిసరాలు, రికార్డులను పరిశీలించి, ఆస్పత్రిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పలు విభాగాలకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రసవాల శాతం పెంచాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీపీవో పద్మజ, ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, వైద్య సిబ్బంది శ్రీధర్ ఉన్నారు.

మహాలక్ష్మి సాయానికి అర్హులెవరు?

- అర్హుల ఎంపికకు మార్గదర్శకాలు ఇవ్వని ప్రభుత్వం
- ఆసరా లబ్ధిదారులు, చిరుద్యోగులకు ఇస్తారా లేదా అనే సందేహం



మోర్తాడ్(బాల్కొండ): తాము అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు నెలనెలా రూ.2,500ల చొప్పున ఆర్థికసాయాన్ని మహాలక్ష్మి పథకం ద్వారా అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆ పార్టీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మహాలక్ష్మి పథకం సాయం పొందే మహిళల వయస్సు 18 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు ఉండాలనే నిబంధన తప్ప మరే ఇతర విధివిధానాలను ప్రకటించలేదు. లబ్ధిదారులను ఎంపిక చేయడానికి అవసరమైన మార్గదర్శకాలను జారీ చేయకపోవడంతో అర్హులు ఎవరు, అనర్హులు ఎందరో అనే విషయం తేలక గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆసరా పథకం కింద వితంతు, ఒంటరి మహిళ, వికలాంగులు, బీడీ కార్మికులు పింఛన్లు పొందుతున్నారు. అలాగే ఆశవర్కర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తల లాంటి చిరుద్యోగులున్నారు. ఇలాంటి వారికి సాయం అందిస్తారా లేదో తేల్చాల్సి ఉంది. అలాగే సాయంకు ఎంపికయ్యే మహిళల కుటుంబాల ఆదాయంను పరిగణలోకి తీసుకుంటారా లేదా అనేది కూడా తేలాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటికే ఆసరా పథకం కింద 77,158 వితంతువులు, 10,520 మంది ఒంటరి మహిళలు, 96,264 మంది బీడీ కార్మికులు పింఛన్లు పొందుతున్నారు.

ధరణి సర్వర్ బిజీబిజీ

- మార్పులు చేర్పులే కారణమంటున్న అధికారులు
- దరఖాస్తులకు ఆటంకాలు

మోర్తాడ్(బాల్కొండ): ప్రైవేటు ఏజెన్సీల చేతుల్లో ఉన్న ధరణి వెబ్‌సైట్‌ను ప్రభుత్వమే తమ ఆధీనంలోకి తీసుకుని భూమాత పోర్టల్‌గా నామకరణం చేసే ప్రక్రియ మొదలైంది. దీంతో రెండు రోజుల నుంచి ధరణి వెబ్‌సైట్ సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకునే ప్రక్రియతో పాటు, ఫీజుల చెల్లింపు, ఆన్‌లైన్ పహాణిలను తీసుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019లో చేపట్టిన రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా ధరణి వెబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లను తహసీల్దార్లకు అప్పగించిన విషయం విదితమే. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చినా పలు ఆప్షన్లను ఇవ్వకపోవడంతో భూముల సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయి. ధరణి పోర్టల్ లోపభూయిష్టంగా ఉందని కేవలం భూస్వాములకు మేలు చేసేదిగా ఉందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తూ వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణి పోర్టల్‌ను భూమాత పోర్టల్‌గా మారుస్తూ చర్యలు ప్రారంభించింది.

మత్తు పదార్థాలపై నిఘాపెట్టాం

- జిల్లాలో ఏడాదిలో 1,329 ఎక్సైజ్ కేసులు
- 707 మందిపై కేసులు, 68 బైక్‌ల స్వాధీనం
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి

ఖలీల్‌వాడి: మత్తు పదార్థాల నిరంతర నిఘా పెట్టినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఎక్సైజ్ వార్షిక నివేదిక వివరాలను వెల్లడించారు. జిల్లాలో ఐదు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో జనవరి నుంచి డిసెంబర్ 27 వరకు 1,329 కేసులు నమోదు చేశామన్నారు. కేసుల్లో 707 మందిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న వారి నుంచి 68 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల వివరాలు	
అల్ప్రాజోలం	3.6 కిలోలు
క్లోరోహైడ్రేట్	49.9 కిలోలు
ఎండు గంజాయి	259.5 కిలోలు
గంజాయి మొక్కలు	68
ఐడీ లిక్కర్	958.05 లీటర్లు
నల్ల బెల్లం	4540 కిలోలు
పట్టిక	1026 కిలోలు
ఎన్‌డీపీఎల్	108 లీటర్లు
దేశీదారు	174 లీటర్లు
గుర్తింపు లేని మద్యం	2,530 లీటర్లు
కల్తీ కల్లు	85,224 లీటర్లు
ఛరీస్	2.3 గ్రాములు
బెల్లం ఊట(పానకం)	82,225

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- కార్డన్ సెర్చ్‌లో సీఐ తిరుపయ్య


కంచర్లలో మాట్లాడుతున్న సీఐ తిరుపయ్య

భిక్కనూరు: ప్రజలు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని భిక్కనూరు సీఐ తిరుపయ్య అన్నారు. గురువారం రాత్రి భిక్కనూరు మండలం కంచర్లలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 53 వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేవని గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి పాన్, ఆధార్ నంబర్లు, ఓటీపీ, బ్యాంక్ ఖాతా నంబర్లు చెప్పవద్దన్నారు. ఆన్‌లైన్ మోసగాళ్లు రోజుకో విధంగా ప్రజలను మోసం చేస్తున్నారని జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వాహనాలకు తప్పనిసరిగా బీమా సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. రోడ్డు నిబంధనలను పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరుగవన్నారు. కార్యక్రమంలో ఎస్సై సాయికుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వృద్ధుడి అదృశ్యం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్‌కు చెందిన పసూల శివయ్య అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శివయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 26న మధ్యాహ్నం 3 గంటల సమయంలో గేదెల షెడ్డు వైపు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రదేశాలు, బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఫోన్‌నంబర్ కూడా స్విచ్‌ఆఫ్ వస్తుంది. వృద్ధుడి కుమారుడు సంజీవ్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

హత్యకేసులో లొంగిపోయిన నిందితులు


బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎదుట లొంగిపోయిన నిందితులు

బాన్సువాడ రూరల్: కుటుంబ కలహాలతో కన్నతండ్రిని హత్య చేసిన కేసులో నిందితుడు అంజాగౌడ్, అతని తల్లి సరోజన గురువారం బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి సమక్షంలో పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. బాన్సువాడ మండలంలోని మొగులాన్‌పల్లిలో తరచూ కుటుంబ కలహాల కారణంగా ఈనెల 24న రాత్రి తండ్రి రామాగౌడ్‌ను తల్లి సరోజన సహాయంతో అంజాగౌడ్ బండరాయితో మోది హత్య చేశాడు. అనంతరం అదే గ్రామానికి చెందిన మిత్రుడు సాయిబాబా సహాయంతో ద్విచక్రవాహనంపై మృతదేహాన్ని చీరలో చుట్టుకుని బుడిమి గ్రామ చెరువులో పారేశారు. ఏమి తెలియనట్టు నటించి, హత్యకేసు నుంచి బయటపడాలని చేసిన ప్రయత్నం విఫలం కావడంతో గురువారం గ్రామ, కులపెద్దల ఎదుట నేరం ఒప్పుకున్నారు. దీంతో నిందితులను గ్రామపెద్దలు స్టేషన్‌కు తీసుకువచ్చి పోలీసులకు అప్పగించారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు.

ఇరువురి మధ్య ఘర్షణ

- ఎంపీ చొరవతో ఒకరిపై కేసు నమోదు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలో ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ జరగడంతో ఒకరిపై కేసు నమోదైంది. మండల కేంద్రానికి చెందిన కస్తూరి గంగాధర్ అనే యువకుడు బైక్‌పై ఆర్మూర్ బైపాస్ రోడ్ మీదుగా నందిపేటలోని తన షాపునకు వస్తుండగా.. ఎదురుగా బైక్‌పై వచ్చిన ఇర్ఫాన్ అనే యువకుడు అదుపుతప్పి పడిపోయాడు. ఈ విషయమై ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో గంగాధర్ అనే యువకుడు ఆర్మూర్ ఎమ్మెల్యే, నిజామాబాద్ ఎంపీలకు ఫోన్‌చేసి ఇర్ఫాన్ అనే వ్యక్తి తనను అకారణంగా కొట్టాడని తెలిపాడు. ఈ విషయంలో ఎంపీ అర్వింద్ ఆర్మూర్ ఏసీపీకి ఫోన్‌చేసి అకారణంగా కొట్టిన వ్యక్తిపై కేసునమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏసీపీ ఆదేశాల మేరకు ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి బాధితుడు గంగాధర్ ఫిర్యాదు చేయడంతో ఇర్ఫాన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

కాలూరులో పేకాట స్థావరంపై దాడి

- ఆరుగురిపై కేసు నమోదు

నిజామాబాద్ రూరల్: మండలంలోని కాలూర్ శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజ్ ఆధ్వర్యంలో సీఐ అజయ్ బాబు, సిబ్బంది పేకాట స్థావరంపై దాడి చేసినట్లు వివరించారు. పేకాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై మహేశ్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 29,450 సీజ్ చేశారు. ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీ సీజ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న మొరం టిప్పర్లు

వర్ని: మండలంలోని హమ్నాపూర్, ఘన్‌పూర్ అటవీ ప్రాంతంలో అక్రమంగా మొరం తవ్వుతున్న జేసీబీ, నాలుగు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ వెల్లడించారు. అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తవ్వి తరలిస్తుండగా గురువారం పట్టుకున్నట్లు తెలిపారు.

నిజామాబాద్‌లో బాలికల ఆచూకీ లభ్యం

- సెల్‌ఫోన్ చూడడంతో తల్లిదండ్రుల మందలింపు
- ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన వారికోసం ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికలు
- నలుగురు బాలికలు ఆదిలాబాద్‌కు చెందిన విద్యార్థినులు

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): తరచూ సెల్‌ఫోన్ చూస్తున్న నలుగురు బాలికలను తల్లిదండ్రులు మందలించడంతో ఆదిలాబాద్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయి వచ్చిన బాలికల ఆచూకీ నిజామాబాద్‌లో లభ్యమైంది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ధోబీ కాలనీకి చెందిన నలుగురు బాలికలు సరస్వతినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. అయితే బాలికలు తరచూ ఫోన్‌లో ఇన్‌స్టాగ్రాం చూస్తుండడంతో తల్లిదండ్రులు మందలించారు. బుధవారం స్కూల్‌కు వెళ్లిన బాలికలు సాయంత్రం 6 గంటలు అయినా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు మావల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు స్కూల్‌కు వెళ్లిన నలుగురు బాలికలు మధ్యాహ్నం ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి అక్కడి నుంచి ఆదిలాబాద్ బస్టాండ్‌కు చేరుకొని నిజామాబాద్ బస్సు ఎక్కినట్లు సీసీ టీవీ ఫుటేజీలో గుర్తించారు. అలాగే తల్లిదండ్రుల సెల్‌ఫోన్లలో ఇన్‌స్టాగ్రాంలో వాయిస్ ఆధారంగా నిజామాబాద్ వచ్చినట్లు గుర్తించి ఇక్కడి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే నిజామాబాద్ పోలీసులు అర్ధరాత్రి బస్టాండ్‌కు చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. మావల పోలీసులకు బాలికలను గురువారం అప్పగించారు. వీరు ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన వారి కోసం నిజామాబాద్‌కు వచ్చినట్లు సమాచారం.